ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

నర్సాపూర్‌లో రిలేదీక్షలో కూర్చున్న మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, మార్చి 4 : డంపింగ్‌యార్డు ఏర్పాటును రద్దు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలేనిరాహారదీక్ష మంగళవారం 15వ రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలో భాగంగా మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఒకటో వార్డుకు చెందిన ప్రజలు రిలేనిరాహారదీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ మాట్లాడుతూ డంపింగ్‌యార్డు ఏర్పాటుతో కలిగే అనార్థాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని పిలుపు నిచ్చారు. జేఏసీ నాయకులు రాజేందర్, రమేశ్‌గౌడ్, రమణారావు, అంజిగౌడ్, రాకేశ్‌గౌడ్, కుమార్, ఒకటో వార్డు సభ్యులు కృష్ణ, వెంకటేశ్, సంజీవ్, విజయ్, యాదగిరి, రాజుగౌడ్, శేఖర్, శ్రీకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆలోచనను పెంపొందించుకోవాలి

సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

చిలిపిచెడ్, మార్చి 4 : సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని బండ పోతుగల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వివిధ రకాల సైన్స్ వస్తువులను తయారు చేశారు. మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ సందర్భంగా పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం ప్రయోగాలు చేస్తూ , ఆలోచనను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మేరీ కృపా, ఉపాధ్యాయులు మహేశ్ కుమార్, సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ : నలుగురికి గాయాలు

వెల్దుర్తి, మార్చి 4 : ఆటో-బైక్ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కుకునూర్ చౌరస్తా సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం మాందాపూర్‌కు చెందిన ప్రకాశ్ ఆటోలో వస్తున్నాడు. అదే మండలం జంగరాయికి చెందిన రాజు, జగన్, విశాల్ ముగ్గురు ఒకే బైక్‌పై నర్సాపూర్‌లో జరిగే విందుకు వెళ్తున్నారు. ఎదురెదురుగా వచ్చిన ఆటో-బైక్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ముగ్గురితో పాటు ఆటోడ్రైవర్ ప్రకాశ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు.

భక్తులకు భద్రత కల్పిస్తాం..

మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

పాపన్నపేట, మార్చి 4 : ఆలయాల వద్ద భక్తులకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏడుపాయలలో భక్తుల వద్ద బంగారం చోరీకి పాల్పడిన నింధితులను అరెస్టు చేసి మంగళవారం విలేకరుల ఎదుట ప్రవేశపెట్టారు. ఆనంతరం ఎస్పీ మాట్లాడుతూ కొన్ని నెలలుగా ఏడుపాయల్లో నిద్రిస్తున్న భక్తుల వద్ద బంగారం చోరీ చేస్తున్న విషయాన్ని పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి దుండుగులను పట్టుకున్నట్లు వెల్లడించారు. వారివద్ద 12 తులాల బంగారం ఆభరణాలు, వారు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు . కేసును ఛేదించడంలో మెదక్‌రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీసీఎస్ సీఐ రాజారెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఏఎస్ఐ సంగయ్య, పోలీసులు ఉన్నారు.

తాగునీటి సరఫరా ప్రారంభం.. మరో పక్క లీకేజీ పర్వం

బీసీ కాలనీలో తాగునీటిని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

బీరప్ప బస్తీలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకై రోడ్డుపై వరదల పారుతున్న తాగునీరు

జిన్నారం మార్చి 4 : బొల్లారం మున్సిపాలిటీలో ఓపక్క మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని అధికారులు లాంచనంగా ప్రారంభించగా మరో పక్క లీకేజీల పర్వం చోటుచేసుకుంది. మున్సిపల్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్ సహకారంతో భారీ సామర్థ్యం గల ట్యాంకులు, రిజర్వాయర్ నిర్మించి, కాలనీల్లో పైప్ లైన్ల నిర్మాణంతో ఇంటింటికీ నల్ల కలెక్షన్లను ఏర్పాటుచేసిన తాగునీటి సరఫరాలో మాత్రం లోపాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బీసీ కాలనీలో కమిషనర్ మధుసూదన్ రెడ్డి కాలనీవాసులతో కలిసి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. కానీ పైప్ లైన్ల నిర్మాణంలో లోపాల కారణంగా మరో కాలనీలో మిషన్ భగీరథ నీరు లీకైన సంఘటన చోటుచేసుకుంది. అధికారుల తీరుపై స్థానికులు బగ్గుమంటున్నారు. నిర్మాణా లోపాలు ఉన్నాయని బాహాటంగా చెబుతున్నారు. రానున్నది వేసవి కాలం దాహార్తిని తీర్చే బాధ్యత అధికారులపై ఉందని కాలయాపన చేయకుండా పొరపాట్లను గుర్తించి పైప్ లైన్ నిర్మాణాన్ని నాణ్యతగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గతంలోనే ట్రయల్ రన్స్ నిర్వహించినప్పుడు లీకేజీలు బయటపడిన సంగతి గుర్తు చేస్తున్నారు. మిషన్ భగీరథ బృందం చేసిన తప్పిదాలతో ప్రాజెక్టులో ఎన్నో లోపాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. లీకేజీ జరిగిన ప్రాంతాలను సైతం సంబంధిత అధికారులు తనిఖీలు చేయకపోవడం ఏంటని నేరుగా ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజలకు అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

IN THE COURT OF THE HON'BLE HIGH COURT OF TELANGANA AT : HYDERABAD
CRP NO. 2246 OF 2024

Between:
1. P. RAMDAS ...Petitioner/JDR No. 2
and
M/s. Ashrita Chit Funds Pvt. Ltd. and 6 others ....Respondents/Judgement Debtors No. 1 & 3 to 6

NOTICE TO 2,3,4 AND 5 RESPONDENTS
2. P. Rajeswar, S/o. Late R. Rachappa, R/o. Flat No. 501, VSR Homes, PSR Enclave, Near Aparna Hill Park, Chanda Nagar, Hyderabad.
3. K. Ramesh, S/o. R. Balaiah, R/o. H.No. 9-3-179, Rozimental Bazar, Hyderabad.
4. M. Thimothi, S/o. M. Sambasiva Rao, R/o. Qrs No. 48/13, Lab Qtrs, DRDO Township, Kanchanbagh, Hyderabad.
5. R. Venkata Ramulu, S/o. R. Rachappa, R/o. LIG 213, 4, KPHB, 4th Phase, Kukatpally, Hyderabad.

In the above said CRP. No. 2246/2024 by my client Ramdas against M/s. Ashrita Chit Fund Pvt. Ltd. and 6 others before the Hon'ble High Court of Telangana. The Hon'ble High Court directed the petitioner Ramdas to send notices to Respondents 2-5 through paper publication. So, take notice that you being the 2-5 Respondents in CRP No. 2246/2024 is posted on 19-03-2025 for your appearance before the Hon'ble High Court of Telangana by person or through Counsel without fail, otherwise the matter will be heard in your absence.
Hence this notice by the orders of the Hon'ble High Court.

NAGA DURGA SAROJA DHULIPALA
ADVOCATE
Counsel for the Petitioner
Date: 04-03-2025
Place: Hyderabad

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా నా క్లయింట్లు 1) శ్రీ ఎ.సంతోష్ కుమార్ తండ్రి స్వర్గీయ ఎ. ఈశ్వరయ్య మరియు 2) ఎ.రూపేశ్ కుమార్ తండ్రి స్వర్గీయ ఈశ్వరయ్య, ఇరువురి నివాసం: బ్రాహ్మన్ వీధి, మెదక్ వారు మెదక్ టౌన్ మరియు జిల్లా, రామాలయం గుడి సమీపాన, వార్డ్ నెం.1, ఇం.నెం.1-3-29/O, 1-3-29/P, 1-3-2Q/1 & 1-3-29/A/2 కలిగిన, వజీర్ సింగ్ ప్లాజా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం.3 మరియు 4కు అసలు యజమానులు, దానిని డాక్యుమెంట్ నెం.4285/2015 కలిగిన రిజిస్టర్ సేల్ డీడ్ క్రింద కొనుగోలు చేశారు. సదరు ఆస్తిని కొనుగోలు చేసిన నా క్లయింట్ విక్రయదారుల మరియు నా క్లయింట్ల ఆదీనంలో ఉన్న, సదరు ఆస్తికి చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ అనగా సేల్ డీడ్ డాక్యుమెంట్ 541 ఆఫ్ 2023 ఇంటి నవీకరణ సమయంలో పోయినది. అందువల్ల ఎవరికైనా సదరు డాక్యుమెంట్ దొరికినచో దానిని నా క్లయింట్‌కు లేదా దిగువ తెలిపిన చిరునామాలో నాకు తిరిగి అప్పగించగలరు. క్లయింట్ చిరునామా: ఎ.సంతోష్ కుమార్, C/o. కామధేను టెక్స్‌టైల్స్, జె.ఎన్.రోడ్, మెదక్-502110. మొబైల్ నెం.9396285085.

జె.వేణుగోపాల్, అడ్వకేట్,
కార్యాలయం: ఫ్లాట్ నెం.203, 2వ అంతస్తు, దేవి నిలయం, శ్వేత గార్డెన్స్ ప్రక్కన, మారుతినగర్, కొత్తపేట్, హైదరాబాద్-500060, మొబైల్ నెం.8008333882

ఆల్ ది బెస్ట్

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు.. పరీక్షా రాయనున్న 12,484 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు

మెదక్‌లోని పరీక్ష కేంద్రం

రామాయంపేట : పరీక్షా కేంద్రంలో నెంబర్లు వేస్తున్న లెక్చరర్లు

మెదక్ మున్సిపాలిటీ /రామాయంపేట, మార్చి 4: ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరుగనున్నది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8.15 నుంచే విద్యార్థులను కేంద్రాలలోకి అనుమతిస్తారు. జిల్లా వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందు కోసం విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 12,484 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సర విద్యార్థులు 6,066, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,418 మంది ఉన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రతలు తీసుకుంటున్నారు. మంచినీటి వసతితో పాటు ప్రథమ చికిత్స వంటి ఏర్పాట్లు సైతం ఏర్పాటు చేశారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 1 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం, 4 సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైన ఇంతకు ముందు అనుమతించే వారు కాదు. కానీ ఈ సారి పరీక్ష ప్రారంభమైన 5 నిమిషాల వరకు అనుమతించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుంది. కేంద్రాల పరిధిలో జిరాక్స్ కేంద్రాలు మూసివేస్తారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నది. ఈసారి 45 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.

కొత్తగా క్యూఆర్ కోడ్

పరీక్షా కేంద్రాల అడ్రస్ తెలియక గతంలో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడేవారు. అలాంటి పరిస్థితులకు తావులేకుండా ఇంటర్ బోర్డు తొలిసారిగా హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది. ఆ కోడ్‌ను స్కాన్ చేయగానే కళాశాలకు చెందిన సంబంధించిన అడ్రస్, గూగుల్ మ్యాప్‌లో కనిపిస్తుంది. దూరంతో పాటు కేంద్రానికి చేరుకునేందుకు పట్టే సమయం కమిపిస్తాయి. విద్యార్థులకు ఈ విధానంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. పరీక్షల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్యలు ఉంటే 7671033323, 830447694 నంబర్లను సంప్రదించాలని డీఐఈవో మాధవి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కౌడిపల్లి, మార్చి 4 : మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన తుడుం దుర్గయ్య అనారోగ్యంతో నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం రూ. 2లక్షల ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. కౌడిపల్లి సోషల్‌మీడియా కన్వీనర్ ప్రతాప్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు రవిసాగర్, నేతలు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న నాయకులు

మదన్‌రెడ్డిని కలిసిన నాయకులు

ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని మంగళవారం కౌడిపల్లి బీఆర్ఎస్ నాయకులు నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సీడీసీ మాజీ చైర్మన్ చిలుముల దుర్గారెడ్డి, నేతలు ఉన్నారు.

విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, మార్చి 4 : మండల పరిధిలోని చిత్రియల్‌లో ముదిరాజ్‌సంఘం అధ్యర్యంలో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేకపూజలు చేశారు. మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నాయకులు ఉన్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు ప్రణాళికలు

ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ బాలస్వామి

మాట్లాడుతున్న ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ బాలస్వామి

మెదక్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ బాలస్వామి అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు ప్రస్తుత వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు అందుకు అధికారుల బృందం ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ శంకర్ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చీఫ్ ఇంజినీర్ బాలస్వామి ప్రత్యేకంగా సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి మెదక్ జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయి అధికారుల నుంచి మొదలుకొని గ్రామంలోని ప్రతి ఒక్క సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేయగా అందు కు అనుగుణంగా వారు సైతం ప్రణాళిక బద్ధంగా వారి విధులను నిర్వహించనున్న ట్లు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఎస్ఈ శంకర్‌తో పాటు జిల్లాలోని డీఈలు చాంద్‌పాషా, గరుత్మంతరాజు, శ్రీనివాసరావు, ఏడీఈలు మోహన్‌బాబు, ఆయా మండలాల ఏఈలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

చాకరిమెట్ల హుండీ ఆదాయం లెక్కింపు

శివ్వంపేట, మార్చి 4 : శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం హుండీ లెక్కించారు. ఐదు నెలల హుండీ లెక్కించగా రూ. 5.75 లక్షల నగదు వచ్చిందని దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో నారాయణరావు, నర్సింగరావు, రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులు ఉన్నారు.

అంగన్‌వాడీలో పురుగుల సాంబారు

సాంబార్‌లో పురుగులు

చిన్నశంకరంపేట, మార్చి 4 : కొందరు అంగన్‌వాడీల నిర్లక్ష్యం వల్ల గర్భిణులకు నాసిరకం భోజనం అందుతున్నది. చిన్నశంకరంపేట మండల పరిధి ఎస్.కొండాపూర్‌లోని సెక్టార్-2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వాహకులు గర్భిణులకు సాంబారును ఇవ్వడానికి వండి తీసుకొచ్చారు. సాంబార్‌ను తీసుకున్న వారి పాత్రను చూడగా అందులో పురుగులు ప్రత్యక్షమయ్యాయి. అధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. అంగన్‌వాడీలోని పప్పు దినుసులను పరిశీలించగా, అందులో పురుగులు తిరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అంజమ్మను పలుమార్లు సంప్రదించినప్పటికీ ఆమె స్పందించలేదు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

చిన్నశంకరంపేట, మార్చి 4 : గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. మంగళవారం ఆయన చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పైప్‌లైన్‌లో లీకేజీ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఏమైనా లీకేజీలు ఉంటే వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంపీడీవో కార్యాలయ సి బ్బంది ఉన్నారు.

చేగుంటలో..

చేగుంట, మార్చి 4 : చేగుంటలోని మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈవో పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రశాంత్ ఉన్నారు.

కొల్చారంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొల్చారం, మార్చి 4 : కొల్చారం జూనియర్ కళాశాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. నేడు జరగబోయే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లపై ఆరాతీశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షాకేంద్రంలో అసౌకర్యానికి గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ గఫర్‌మియా ఉన్నారు.

వరిపంటను పరిశీలించిన కలెక్టర్

కొల్చారం మండల పరిధిలోని వరిగుంతంలో మంగళవారం కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులు అవసరం ఉన్న మేరకే భూగర్భ జలాలను ఉపాయోగించాలని, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని జలాలను పొదుపుగా వాడుకోవాలన్నారు. అధికారులు ఉన్నారు.

అక్కన్నపేటలో తాగునీటి ఎద్దడి

ట్యాంకర్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

రామాయంపేట రూరల్, మార్చి 4 : రామాయంపేట మండలం అక్కన్నపేటలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరాఫరా నిలిచిపోయింది. దీంతో మహిళలు బోరుబావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మంగళవారం అధికారులు ట్యాంకర్ ఏర్పాటు చేసి కాలనీల్లో తాగునీరు సరాఫరా చేశారు. గతంలో ఏ ఒక్క రోజు కూడా తాగునీటి కోసం రోడ్డుకు ఎక్కలేదని పేర్కొన్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా, రోడ్డు వెడల్పులో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు మిషన్ భగీరథ పైపులైన్లు మార్చడం, ఉన్నచోటు నుంచి రోడ్డు వెడల్పు కోసం దూరం మార్చడం వల్ల నీటి సరాఫరాకు అంతరాయం కలిగిందన్నారు. రేపటి నుంచి యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.

ముందుస్తు అరెస్టులు అప్రజాస్వామికం

శివ్వంపేట పోలీసుల అదుపులో అంగన్‌వాడీ టీచర్లు

నిజాంపేట, మార్చి 4 : అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని నిజాంపేట మండల అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం నిజాంపేట పోలీసులు మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లను ముందుస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నేండ్లుగా విధులు నిర్వహిస్తున్నా వేతనాలు మాత్రం సరిగ్గా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు అయిన వారిలో అరుణశ్రీ, రేణుక, దుర్గేశ్వరి, మణెమ్మ, సుధా, సునీత, వీణ, రామలక్ష్మి ఉన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, మార్చి 4 : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ మినీ టీచర్లకు పెంచి వేతనాలను 9 నెలలుగా వేతనాలను పెండింగ్ ఉంచడంతో హైదరాబాద్‌కు వెళ్తున్న అంగన్‌వాడీలను శివ్వంపేట పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు సరిత, సుగుణ తదితరులు ఉన్నారు.

వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

చిలిపిచెడ్, మార్చి 4 : వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని చిట్కుల్ విద్యుత్ ఉపకేంద్రంలో 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏ కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేసవిలో యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యుత్ సరఫరాలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజినీర్ ఎస్ఈ శంకర్, డీఈ చందపాషా, ఏడీఏ రమణరెడ్డి, మండల ఇన్‌చార్జి ఏఈ సల్మాన్ ఖాన్, లైన్‌మెన్లు కృష్ణ, శ్రీశైలం, రూప్‌సింగ్, కాంట్రాకర్ పండునాయక్ ఉన్నారు.

యువత వికసిత్ భారత్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 4 : మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువత మార్చి 9 వరకు గూగుల్‌లో మై భారత్ పోర్టల్‌లో మెగా ఈవెంట్‌ను క్లిక్ చేయడం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9885077541, 9985372264, 9912787070 సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రేణుకా రెడ్డి

అల్లాదుర్గం, మార్చి 4 : కారు, టీవీఎస్ ఢీ కొనడంతో భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం పోలీస్టేషన్ పరిధిలోని పల్లెగడ్డ శివారులోని 161వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన బండ సాయిలు (55), బండ మాణె మ్మ (50) మంగళవారం టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి సంతలో కూరగాయలు విక్రయించడానికి టీవీఎస్‌పై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా పల్లెగడ్డ శివారులోని 161 వ జాతీయ రహదారిపై అల్లాదుర్గం నుంచి జోగిపేట వైపు వెళ్తున్న కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సీఐ రేణుకారెడ్డి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

రైతువేదికలో 'రైతునేస్తం'

రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న వ్యవసాయాధికారులు

నర్సాపూర్, మార్చి4 : నర్సాపూర్ పట్టణంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం (వీడియో కాన్ఫరెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. మొజెర్ల హార్టికల్చర్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ షేహనాజ్ వేసవి కూరగాయలు వాటి యాజమాన్య పద్ధతులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పశుసంపద-పశు జాతి అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి విన్సెంట్ వినయ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ నిర్మల, ఏవో దీపిక, ఏఈవోలు చంద్రవేణి, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్‌లో చోరీ

రామాయంపేట, మార్చి 4 : రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలోని ఓ ఇంటర్‌నెట్ షాప్‌లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల సతీశ్ గ్రామంలోనే ఇంటర్‌నెట్ షాపు నడిపిస్తున్నాడు. గుర్తుతెలియని దొంగలు సోమవారం రాత్రి కాపుకాసి దుకాణం వెనుక నుంచి రేకులను తొలిగించి లోనికి వెళ్లి రెండు కంప్యూటర్లు, రెండు మానిటర్లు, సీసీ కెమెరాలతో బాటు రూ. 25 వేల నగదు లూటీ చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న రామాయంపేట పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నిజాంపేట, మార్చి 4 : మండలంలోని నార్లపూర్‌లో రూ. 30 లక్షల వ్యయంతో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు అమరసేనారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమరసేనారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్డు నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామ రూపురేఖలు మారుతున్నాయని, నాణ్యతా ప్రామాణాలు పాటించాలన్నారు. మాజీ ఉపసర్పంచ్ కిషన్, గ్రామస్తులు నాగరాజు, భాస్కర్, సూర్యనాయక్ పాల్గొన్నారు.

చెత్తను వేరు చేసే విధానంపై అవగాహన

నర్సాపూర్, మార్చి 4 : నర్సాపూర్ మున్సిపాలిటీలోని 4,5,6 వార్డుల్లో బేసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెత్తను తడి, పొడి, హానికరచెత్తగా వేరుచేసే విధానంపై పట్టణ వాసులకు మంగళవారం అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని కరపత్రాలను ఇస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బేసిల్ ఫౌండేషన్ నిర్వాహకులు ఉదయ్, విష్ణు, నరేందర్, ఇంజినీర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, జవాన్ ఎల్లం, మెప్మా ఆర్పీలు శివలీల, పుష్ప, శ్రావణి, లత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రామాయంపేట, మార్చి 4 : రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మ బస్తీకి చెందిన ఓ వివాహానికి మంగళవారం వ్యాపారి గజవాడ నాగరాజు రూ. 20వేల విలువ గల నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యాక్రమంలో ఎస్‌కే హైమద్, బసన్నపల్లి మల్లేశం, నవీన్, చింతల యాదగిరి, సురేశ్ నాయక్, తదితరులు ఉన్నారు.

చేగుంటలో..

చేగుంట, మార్చి 4 : నిరుపేద వధువు కుటుంబానికి బట్టలు, బియ్యం ఆర్థిక సాయం అందించి చేయూత నందించారు. మండల కేంద్రమైన చేగుంటకు చెందిన చాకలి మణెమ్మ, యాదగిరి కుతూరు సౌజన్య వివాహాన్ని జిల్లా వాలీబాల్ ఆసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి మంగళవారం 50కిలోల బియ్యం అందజేశారు. మాజీ వార్డు సభ్యులు కట్టా శ్రీనివాస్, అయిత విజయలక్ష్మి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

SCRAP FOR SALE

★ **Tenders are invited from the parties** who are granted Registration by Pollution Control Board for lifting the Scrap (Cut Belts, Nitrile Flash, Polyester Cord, Scorched Compound, Damaged Oil Seals, Moulded Rubber Products, MS Plastic Barrels, Plastic Carbouys, Polythene Waste, Oil, MS Scrap, Wood, Kachara Scrap & Other Misc.) on Daily basis. Interested Parties may Contact the undersigned for inspection. Last Date of Submission: 11-03-2025. Contact: Manager (Materials), J.K. Fenner (India) Limited, 4 & 22, IDA, Phase IV, Patancheru-502 319, Phone: 08455242636, 9908153792.

NT-331012

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.